క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సోమవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీసీపీ డీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ వాసవి ఫార్మా ఫీడర్, 11కేవీ అయ్యప్ప స్వామి టెంపుల్ లైన్ల మరమ్మతుల కారణంగా అంతరాయం కలుగుతుందన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ట్రిబుల్ఎస్ కాలనీ ఏరియా, వస్త్రలత కాలనీ ఏరియా, రాధామాధవ్ టింబర్ డిపో ఏరియా, మధుసూదన టింబర్ డిపో ఏరియా, హెడ్ పోస్టాఫీస్ ఏరియా వరకు కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు.

గౌస్‌కు పీహెచ్‌డీ ప్రదానం



జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా కళాశాల కంప్యూటర్స్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు సయ్యద్ గులాంగౌస్‌కు రాయలసీమ యూనివర్సిటీ పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేసింది. కృష్ణా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ రెడ్డి కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో క్లస్టర్ బేస్డ్ ఆప్టిమల్ సింక్ రీపొజిషనింగ్ టెక్నిక్ ఫర్ డబ్ల్యూ ఎస్ఎన్స్ యూజింగ్ యాన్ ఇంప్రూవ్డ్ పర్టికల్ స్వరం ఆప్టిమైజేషన్ అండ్ ఎస్టార్ పొజిషన్ సెర్చ్ అల్గారిథం (వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్) అంశంపై పరిశోధన చేసి గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. అందుకు గాను పీహెచ్‌డీ డిగ్రీ ప్రధానం చేశారు. శనివారం కళాశాలలో అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, అధ్యాపకులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించేందుకే సురక్ష

నూజివీడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మీర్జాపురంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దండుబోయిన స్వర్ణలత, హెచ్‌వో రాజులపాటి హేమ, వైఎస్సార్ సీపీ నాయకులు జోగి ప్రభాకర్‌రావు, ఆరేపల్లి రాంబాబు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్



జి.కొండూరు: బుడమేరులో వరద ఉధృతి కారణంగా మండల పరిధిలోని హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య వంతెన వద్ద పైపులైను పగిలిపోయింది. దీంతో వెలగలేరు, కందులపాడు, వెల్లటూరు గ్రామాలకు కృష్ణావాటర్ సరఫరా రెండు రోజులుగా నిలిచిపోయింది. వరద ఉధృతి ఇప్పుడిప్పుడే తగ్గుతున్న క్రమంలో ఆది, సోమవారాల్లో పైపులైను మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాని పునరుద్ధరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు శనివారం తెలిపారు. అప్పటి వరకు ప్రజలు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: తిరువూరులో ఆదివారం ఉదయం 9గంటల నుంచి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అమరావతి స్మైల్ మదర్ అండ్ చైల్డ్‌కేర్ ఆసుపత్రి చైర్మన్ కోనేరు వెంకట కృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో చిన్నపిల్లల వైద్యులు, శస్త్రవైద్యులు పాల్గొంటారు. పిల్లలకు తగిన పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తామన్నారు.

అక్రమ రవాణా బాధితులకు పునరావాసం కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానవ అక్రమ రవాణా, వ్యాపార లైంగిక దోపిడీకి గురైన బాధితులకు కమ్యూనిటీ ఆధారిత పునరావాసాన్ని కల్పించాలని అక్రమ రవాణా బాధితుల రాష్ట్ర వేదిక విముక్తి అధ్యక్ష, కార్యదర్శులు అపూర్వ, పుష్ప ప్రభుత్వాన్ని కోరారు. బాధితులకు ఆర్థిక, సామాజిక సాధికారతను అందించాలన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి ×అక్రమ రవాణా బాధితులు అందరినీ కలవండి, ఏ ఒక్కరినీ వదలకండి₹ అనే నినాదంతో అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. బాధిత మహిళలందరికీ కమ్యూనిటీ ఆధారిత పునరావాసం కల్పించి, నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో విముక్తి నాయకులు బాజీవలి, మౌనిక పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక..

- విస్సన్నపేట హైస్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే రక్షణనిధి
- అసత్య కథనాలతో రాద్ధాంతం తగదు
- నియోజకవర్గంలో రూ.54 కోట్లతో పాఠశాలల్లో నాడు–నేడు పనులు పూర్తి
- విస్సన్నపేట హైస్కూల్‌ను రూ.65 లక్షలు, మండలంలో రూ.12 కోట్లతో స్కూళ్లు అభివృద్ధి చేశాం



వినియోగంలో లేని తరగతి గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: నాడు–నేడు కార్యక్రమంలో జరిగిన అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌ను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కావాలనే కొందరు విస్సన్నపేట హైస్కూల్లో వినియోగించని తరగతి గదిలో వర్షంనీటిలో విద్యార్థులను కూర్చోబెట్టి లేనిపోని రాద్ధాంతం చేయటం సరైన విధానం కాదని ఎమ్మెల్యే అన్నారు. ఇటువంటి అసత్య కథనాలను కొన్ని మీడియాల్లో రావటం వాటిని చూసి ప్రతిపక్షాలు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని, బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. కాగా నాడు–నేడు కార్యక్రమం ద్వారా తిరువూరు నియోజకవర్గంలో రూ.54 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. విస్సన్నపేట మండలంలో రూ.12 కోట్లకుపైగా నిధులు కేటాయించి నాడు– నేడు పనులు చేశామని తెలిపారు. విస్సన్నపేట హైస్కూల్‌లో రూ.65 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. నాడు–నేడు పనులు ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ, హెచ్‌ఎం ల పర్యవేక్షణలో జరిగాయని ప్రతిపక్షాలు గమనించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, తరగతి గదుల్లో అవసరమైన విద్యుత్తు లైట్లు, బెంచీలు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, పాత్‌వేలు వంటివి ఎన్నో మౌలిక వసతులు కల్పించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నారు. గతంలో విద్యార్థులు కూర్చోవటానికి బెంచీలు కావాలన్నా దాతల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. నేడు అటువంటి పరిస్థితి లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా వసతులు కల్పించటం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై లేని పోని అసత్య ఆరోపణలు చేయవద్దన్నారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కెడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, సచివాలయాల కన్వీనర్ల మండల కన్వీనర్ శివబాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఎంపీటీసీ జి మల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్ శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు ముత్యాలరావు, మండల యూత్ అధ్యక్షుడు హరి, ఎంఈఓ–2 సుధాకర్ పాల్గొన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



మైలవరంలో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మైలవరం: సీఎం జగన్, మంత్రి జోగిరమేష్‌లపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మైలవరం బోసుబొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రబాబు దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా జి.కొండూరు జెడ్పీటీసీ సభ్యుడు మందా చక్రధరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రిజోగి రమేష్‌లను విమర్శించే అర్హత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేదన్నారు. సీఎం జగన్‌కు ప్రజల్లో పెరుగుతున్నఆదరణ చూసి తట్టుకోలేకే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల ద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. జగన్, జోగి రమేష్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యాలను ఉపసంహరించుకోవాలని,లేనిపక్షంలో తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మాజీ మంత్రి దేవినేని ఉమాకు ఎమ్మెల్యే సీటు దక్కుతుందో లేదోనని, మానసిక వేదనతోఅనుచిత వ్యాఖ్యాలు చేస్తున్నాడని అన్నా రు. నాయకులు పిల్లి రామారావు, కోమటి కోటేశ్వరరావు, చంద్రం, సూరపనేని నాగేంద్ర, పామర్తి అప్పారావు,నల్లమోతుమధు,వేములకొండ సుబ్బా రావు, జొన్నబోయిన శ్రీనివాసరావు, బొలగాని శ్రీనివాసరావు, జంగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ ఛైర్మన్‌కు సతీవియోగం



నాగావళి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పుట్రేల (విస్సన్నపేట): ఏఎంసీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సతీమణి నాగావళి (65)అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. స్వగ్రామం అయిన పుట్రేలలో మృతురాలి భౌతికకాయానికి ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏపీ కో ఆపరేటివ్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీలు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి, వైస్‌ఎంపీపీ రెడ్డిశ్రీనివాసరావు, మాజీ వైస్‌ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు నివాళులర్పించారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



విద్యార్థి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: విపత్తులు సంభవించినప్పుడు ధైర్యం వహించాలని, బాధిత కుటుంబాలకు అందరూ అండగా నిలవాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు తమ్మిలేరులో మునిగి మృతి చెందిన బలివే వెంకటాపురం ఇంటర్మీడియట్ విద్యార్థి నర్రా శ్రీబాబు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. శనివారం రాత్రి మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి మృతుని ఇంటికి చేరుకున్నారు. ముందుగా మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రులు నర్రా శ్రీను, దేవిశ్రీని ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ ఆపదవేళ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచి రావు ప్రవీణ సుధాకర్, జిల్లా రైతు సలహా సంఘ కార్యదర్శి రవీంద్రరెడ్డి, స్థానిక నేతలు మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనారెకు ఘన నివాళి



తిరువూరు: డాక్టర్ సీ నారాయణరెడ్డి తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించారని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కే పాపారావు పేర్కొన్నారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సీ నారాయణరెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి సేవల్ని పలువురు కొనియాడారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు ఎల్.గంగాధర్, ఎం. రాంప్రదీప్, ప్రజాసంఘాల నాయకులు వెంకటరత్నం, రామకృష్ణ, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మణిపూర్ ఘటనపై చర్చావేదిక

తిరువూరు: మణిపూర్ మారణహోమం ఘటనపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులో చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి నాగేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సత్య బీ ఎడ్ కళాశాలలో ఉదయం 10గంటల నుంచి నిర్వహించే సదస్సుకు కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మామిడి రైతుల సమావేశం

నూజివీడు: పట్టణంలో ఏర్పాటు చేయనున్న మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌పై స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం దయాల రాజశేఖర్ శనివారం తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ కేఎల్ఎస్ రెడ్డి, సెర్ప్ పీఎం కే సరళ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు పాల్గొంటారన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లోని మామిడి సాగుచేసే మహిళా రైతులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ధ్వంసమైన డైవర్షన్ రోడ్డు



కట్టలేరు వద్ద ధ్వంసమైన డైవర్షన్ రోడ్డు

గంపలగూడెం: వరద ఉధృతి కారణంగా గంపలగూడెం మండలంలో తోటమూల–వినగడప గ్రామాల మధ్య కట్టలేరు వద్ద ధ్వంసమైన వంతెన పక్కన నిర్మించిన డైవర్షన్ రోడ్డు పాడైపోయింది. ఎగువ తెలంగాణ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా గడచిన ఐదురోజులుగా ఏటిలో నీరు ఉధృతంగా పారింది. శనివారం ఏటిలో నీటి ఉధృతి కొంత తగ్గింది. ఐదు రోజులుగా డైవర్షన్ రహదారిపై అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించడంతో మట్టికొట్టుకుపోయి రాళ్లు బయటపడ్డాయి. ఏటిలో నీటిప్రవాహం తగ్గినప్పటికీ రహదారి ధ్వంసం కారణంగా రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. అధికారులు సత్వరమే స్పందించి తగిన చర్యలు తీసుకుని రాకపోకలను పునరుద్ధరించాలని ఏటి అవతల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు



ప్రభుత్వాస్పత్రిలో వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎస్‌ఐ ధర్మరాజు

జి.కొండూరు: ఎలుకల మందు తాగిన వ్యక్తిని జి.కొండూరు పోలీసులు సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలను కాపాడారు. వివరాలలోకి వెళ్తే..జి.కొండూరు మండల పరిధి వెల్లటూరు గ్రామ శివారు బీమవరప్పాడుకు చెందిన బోటపాక వెంకటేశ్వరరావుకి మైలవరం మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన నాగరాణితో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఆరు నెలల క్రితం భార్య, భర్తలు ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో ఇద్దరు పిల్లలతో కలిసి నాగరాణి తన పుట్టింటికి వెళ్లింది. నెలలు గడుస్తున్నా భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురైన వెంకటేశ్వరరావు శనివారం సాయంత్రం సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అనంతరం ప్రాణాలు పోతాయని భయాందోళనకు గురై 100కి ఫోన్ చేసి తాను ఎలుకల మందుతాగానని సమాచారం అందించాడు. అయితే తాను ఎక్కడ ఉన్నదీ చెప్పలేదు. దీంతో సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్ఐ ధర్మరాజు, కానిస్టేబుల్ భాస్కర్‌రావుతో కలిసి బీమవరప్పాడు గ్రామానికి వెళ్లారు. అక్కడ మరో వ్యక్తి సాయంతో గంటపాటు వెతికి బాధితుడు ఆచూకీ తెలుసుకున్నారు. గ్రామ శివారులోని మామిడితోటలో ఉన్న వెంకటేశ్వరరావుని వెంటనే ఎస్ఐ తమ వాహనంలో మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వెంకటేశ్వరరావు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో స్పందించి బాధితుడి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ ధర్మరాజు, కానిస్టేబుల్ భాస్కర్‌రావును పలువురు అభినందించారు.

గ్రామ దేవతలకు పూజలు

చాట్రాయి: మండలంలోని పోతనపల్లిలోని తండా ప్రజలు శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తండాలోని అన్ని కుటుంబాల వారు ఉదయం గ్రామంలోని ముత్యాలమ్మ తల్లి, సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని 300 కుటుంబాల వారు ఇతర గ్రామాల్లో ఉన్న బంధువులను పిలుచుకుని ఊరు బయట ఉన్న తోటల్లోకి వెళ్లి వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కారంగుల వాసు, గిరిజన నాయకులు నాగేశ్వరావు (నాగ) తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

నూజివీడు: ట్రిపుల్ ఐటీ హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌ఆర్‌పేట, స్టేషన్‌తోట, సిద్ధార్థనగర్‌లోని పేదలకు శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఇటీవల నూజివీడు ప్రాంగణంలోని విద్యార్థుల నుంచి, ఫ్యాకల్టీ నుంచి సేకరించిన వస్త్రాలతో వస్త్రదాన శిబిరాన్ని నిర్వహించారు. డెస్టినీ చెంజ్స్ సంస్థ సహకారంతో దాదాపు 53 కుటుంబాలకు 239 జతల దుస్తులను అందించారు. ఈ కార్యక్రమానికి యనాది కాలనీ టీచర్ పద్మావతి, నవజీవన్ బాలభవన్ సొసైటీ జోనల్ కోఆర్డినేటర్ బీ రవి తోడ్పాటు అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు అభినందించారు. హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు సలీంబాబు, సభ్యులు లక్ష్మణరావు, సీతాపతి, రాజేష్, మధు, వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ఊటుకూరులో పీర్ల ప్రదర్శన



వినగడపలో పీర్లకు మొక్కుతున్న మహిళలు

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, ఎ.కొండూరు, కంభంపాడు గ్రామాల్లో శనివారం ముస్లింలు మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల మసీదుల్లో ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చీమలపాడు మసీదు ఇమామ్ ఎండీ బషీర్ మాట్లాడుతూ ఇస్లామ్ ధర్మ స్థాపన కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహర్రం పండుగ అన్నారు. ప్రాణ త్యాగాలు చేసిన మహానీయులను గుర్తు చేసుకుంటూ సంతాప దీనాలు పాటిస్తారని తెలిపారు. అనంతరం పానకాలను ప్రసాదంగా స్వీరించారు. అనంతరం చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో సజ్జదా నషీన్ మహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ ఆధ్వర్యంలో మొహర్రం పండుగ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఊటుకూరు(గంపలగూడెం): మొహర్రం పండుగను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి ఊటుకూరు, వినగడపల్లో పీర్ల ప్రదర్శనను భక్తిశ్రద్ధలతో జరిపారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఆయా గ్రామల్లో అట్టహాసంగా ఊరేగించారు. పీర్లు తమ ఇళ్ల ముంగిటకు రాగానే నీరు వారబోసి, ప్రసాదం అందజేశారు. ఊటుకూరు ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

లింగాల కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేత



దెబ్బతిన్న లింగాల కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులు

వత్సవాయి: చిల్లకల్లు వైరా రహదారిపై లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వేపై రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ పరశురాం తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాజ్‌వేపై నుంచి వరదనీరు ఉధృతంగా పారింది. శనివారం వరద తీవ్రత తగ్గడంతో కాజ్‌వే పరిస్థితి ఎలా ఉందో ఆర్‌అండ్‌బీ డీఈ పరశురాం, నందిగామ డీఎస్పీ జనార్ధన్‌నాయుడు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాజ్‌వేపై వరద తాకిడికి ప్రమాదకరస్థాయిలో పగిలిపోయి ఉండడాన్ని గమనించారు. రహదారి మొత్తం పెచ్చులు లేచిపోయింది. కాజ్‌వే కింద ఎటువంటి సపోర్టు లేకుండా మట్టి కుంగడంతో భారీ వాహనాలు వెళ్తే రహదారి ఒక పక్కన విరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం కాజ్‌వేపై ఆర్‌అండ్‌బీ అధికారులు పనిచేసేవరకు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎస్, టీఎస్ ఆర్టీసీ వారు నెల రోజులవరకు డైవర్షన్‌తో కూడిన దారులను ఎంచుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ నరేంద్ర, ఎస్ఐ బి.అభిమన్యు పాల్గొన్నారు.

గండేపల్లిలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో శనివారం పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. ఇటీవల కుండపోతగా కురిసిన వర్షానికి గ్రామ సమీపంలో చప్టాకు వరదనీరు చేరింది. వరద తగ్గుముఖం పట్టటంతో ఆ ప్రాంతమంతా తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని అక్కడ బ్లీచింగ్, సున్నం చల్లించామన్నారు. రోడ్ల వెంట, కాలువల వద్ద బ్లీచింగ్ చల్లించామన్నారు. ఏఎన్ఎం శిరీష, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, సచివాలయ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా సప్త శనివార సేవ



విజయవాడ కల్చరల్: శ్రీ శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో సప్త శనివారం కార్యక్రమంలో భాగంగా ఉదయం శృంగేరీ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి, విదుశేఖర భారతీ స్వామి ఆదేశంతో శనివార సేవను వైభవంగా నిర్వహించారు. సర్వాలంక భూషితుడైన శ్రీదేవీ భూదేవి సమేతుడైన శ్రీ వెంకటేశ్వరస్వామికి షోడష ఉపచారాలతో పూజలు నిర్వహించారు. వివిధ రకాలైన పూలతో అలంకరించి భక్తులకు దర్శనానికి అనుమతించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రవణ సదనంలో లోక కల్యాణార్థం శ్రీ మహావిష్ణువు సహస్రనామ పారాయణం తులసి అర్చన నిర్వహించారు.

మూగజీవిలో అమ్మ ప్రేమ



నందిగామ: శునకం.. విశ్వాసానికి ప్రతిరూపం.. దానిలో దాగి ఉన్న అమ్మ ప్రేమ... మూడు రోజులుగా కన్న బిడ్డలను చూసేందుకు తపిస్తోంది. నందిగామ మండలం ఐతవరం సమీపంలో ఓ తల్లి శునకం పిల్లలను చేరేందుకు ఎంతో ఆరాటపడింది. ఐతవరం వద్ద జాతీయ రహదారిపై వరద ప్రవాహానికి భారీ వాహనాలు నిలిచిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇంటి వద్ద ఓ శునకం పిల్లలను పెట్టింది. వరద సమయంలో అవతల వైపు ఉండిపోయిన ఆ మూగ జీవి భారీ వాహనం అటువైపు వెళ్లినప్పుడు దానివెనుక రెండు రోజులుగా వెంట పడుతోంది. కొంతదూరం వెళ్లి వరద ప్రవాహానికి వెళ్లలేక వెనుదిరుగుతోంది. శనివారం ఈ విషయాన్ని అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు గమనించారు. వరద ప్రవాహంలో ఉన్న ఆ ఇంట్లోకి వెళ్లి పరిశీలిస్తే అక్కడ రెండు కుక్క పిల్లలు ఉన్నాయి. నీటిలో తడిసి వణుకుతున్న వాటిని తీసుకువచ్చి శుభ్రం చేసి తల్లి కుక్కకు దగ్గర చేర్చారు.